### 06. 45వ మోటార్ షో

థాయిలాండ్ 45వ బ్యాంకాక్ ఇంటర్నేషనల్ మోటార్ షో (45వ బీఐఎంఎస్) మార్చి 27 నుంచి ఏప్రిల్ 7 వరకు నిర్వహించారు. 'ది మొబిలిటీ ఆఫ్ జాయ్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్' అనే థీమ్‌తో ఈ షో ను చేపట్టారు. ఈ షో ను 1.6 మిలియన్ల మంది సందర్శించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బైక్ 'ఫెలో టూజ్'ను ప్రదర్శించారు. ఇది గంటకు 200 కి.మీ. వేగంతో వెళుతుంది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 720 కి.మీ. ప్రయాణిస్తుంది. దీనికి ల్యాప్‌టాప్ సైజులో డిజిటల్ స్క్రీన్, 6-చానల్ సౌండ్ సిస్టమ్ ఉంది.

# జేఈఈ మెయిన్స్ స్కోర్‌తో కాలేజీ, కోర్సు ఎంపిక ఎలా ?

**దేశవ్యాప్తంగా సుమారు పది లక్షల మంది రాసే పరీక్ష జేఈఈ మెయిన్స్. 2024 సంవత్సరానికి మెయిన్స్ పరీక్షలు పూర్తయ్యాయి. ఫలితాలు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యకు ప్రఖ్యాతిగాంచిన ఎన్ఐటీలు, ఐఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. రెండు సెషన్లుగా నిర్వహించిన ఈ పరీక్షల ర్యాంకులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. దీంతోపాటు ఈ నెలాఖరులో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరుగనుంది. జేఈఈ మెయిన్స్‌లో టాప్-20లో నిలిచిన వారు ఈ పరీక్ష రాయడానికి అర్హులు. ఈ పరీక్ష ద్వారా ఐఐటీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. అయితే కేవలం నెల రోజుల వ్యవధిలో అంటే జూన్ రెండోవారంలో ప్రారంభం కానున్న ప్రవేశ ప్రక్రియకు విద్యార్థులు, వారి తల్లి దండ్రులు కొంత కసరత్తు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా జేఈఈ మెయిన్స్ ద్వారా ఎన్ఐటీ, ఐఐఐటీల్లో ప్రవేశాలు పొందాలనుకునే వారికి సంక్షిప్తంగా ఆయా సంస్థల గురించి ప్రాథమిక జ్ఞానం అవసరం. ఇంజినీరింగ్ ప్రవేశాలు, కాలేజీలు, కెరీర్ తదితర అంశాల్లో సుమారు రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న నానో ఐఐటీ డైరెక్టర్ వై శ్రీనివాసరావు (వైఎస్) సలహాలు, సూచనలు జేఈఈ మెయిన్స్ రాసిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల కోసం ప్రశ్న, సమాధానం రూపంలో..**



**ప్రశ్న: జేఈఈ మెయిన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. దీనిలో టాప్ పర్సంటైల్ సాధించిన వారు ప్రవేశాల కసరత్తు ప్రారంభించాలా?**

**సమాధానం:** ప్రస్తుతం జేఈఈ మెయిన్స్‌లో మంచి పర్సంటైల్ సాధించిన వారు ప్రవేశాల కోసం అసలు ఆలోచించవద్దు. ఈ నెలాఖరులో జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలపై దృష్టి పెట్టాలి. ఆ పరీక్షలో మంచి ఫలితాన్ని సాధించడానికి ఈ పదిహేను రోజులను సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రులు కూడా వారి పిల్లల వద్ద ప్రవేశాల గురించి మాట్లడకుండా ఉండటం మంచిది. అయితే తల్లిదండ్రులు కొంత కసరత్తు చేయాలి. అదేవిధంగా జేఈఈ మెయిన్స్ ర్యాంక్ ఆధారంగానే ప్రవేశాలు పొందాలనుకునే వారు కూడా ఇప్పటినుంచి కొంత కసరత్తు ప్రారంభిస్తే మంచిది.

- జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు సాధించిన వారికి జోసా కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, జీఐఎఫ్‌టీల్లో కామన్‌గా అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభిస్తారు.
- జేఈఈ మెయిన్స్ ద్వారా ప్రవేశాలు పొందాలనుకునే వారు కొన్ని విషయాలు తెలుసుకోవాలి. ప్రస్తుతం 31 ఎన్ఐటీలు, 25 ఐఐఐటీలు, 35 జీఎఫ్‌టీఐలు ఉన్నాయి. వీటి సంఖ్య కచ్చితంగా జోసా కౌన్సెలింగ్ సమయంలో తెలుస్తుంది.
- మొదటి స్థానంలో టాప్ టైర్- తిరుచ్చి, వరంగల్, సూరత్‌కల్, రూర్కెలా
- రెండో స్థానంలో- నాగపూర్, కోజికోడ్, సూరత్, భోపాల్, జైపూర్, కురుక్షేత్ర తదితరాలు
- మూడో స్థానంలో- పాండిచ్చేరి, రాయపూర్ తదితరాలు
- నాలుగో కేటగిరీ- నార్త్ ఈస్ట్ ప్రాంతంలోనివి



**ప్రశ్న: అడ్వాన్స్‌డ్‌లో మామూలు ర్యాంక్ వచ్చి మెయిన్స్‌లో మంచి ర్యాంక్ వచ్చిన వారు ఎలాంటి సంస్థల్లో ప్రవేశాలు తీసుకోవాలి?**

**సమాధానం:** కెరీర్‌లో అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు ఏదైనా లక్ష్యం ఉంటే దాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలి. ఉదాహరణకు ప్రభుత్వ ఉద్యోగం చాలనుకునే వారు ఏదో ఒక బ్రాంచీలో జాయిన్ అయి అటువైపు అంటే ప్రభుత్వ సెక్టార్ జాబ్స్ వైపు వెళ్లవచ్చు. కొంతమందికి ఎంబీఏ వైపు వెళ్లాలని ఉంటుంది. వారు భవిష్యత్తులో ఐఐఎం, ఐఎస్‌బీ వంటి పేరు గాంచిన సంస్థల్లో మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనుకునే వారు కూడా ఐఐటీల్లో వారికి వచ్చిన ర్యాంక్ ఆధారంగా ఏదో ఒక బ్రాంచీలో చేరి కోర్సుతో పాటు ప్రొఫైల్ బిల్డప్ చేసుకోవాలి. దీనికోసం ఐఐటీ ట్యాగ్‌తో పాటు కోర్సు, ఎక్స్‌ట్రా కరికులం యాక్టివిటీస్ తదితరాలతో ముందుకు పోవచ్చు. మరికొంతమంది మాస్టర్స్ కోసం అబ్రాడ్‌కు వెళ్లాలనుకుంటారు. వీరు దానికి తగినవిధంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలి.

- నాలుగో రకం అభ్యర్థుల గోల్ కేవలం ఐటీ సెక్టార్‌లో సెటిల్ కావడం. అటువంటి వారు ఎక్కడైనా పర్వాలేదు కానీ ఐటీలో మంచి పొజిషన్ కావాలనుకుంటే వారు టైర్- 2, 3 (హైదరాబాద్ తప్ప) అంటే రెండో జనరేషన్‌లో సర్క్యూట్ బ్రాంచీలు కాకుండా కోర్ బ్రాంచీలు వస్తే వీరు టాప్ టైర్ ఎన్ఐటీల్లో సీఎస్ఈలో చేరడం ఉత్తమం. ఇది కేవలం ఐటీలోకే వెళ్లాలనుకునే వారికి మాత్రమే. ఇక ఐఐటీల్లో మెకానికల్, సివిల్ తదితర బ్రాంచీలు చేసి ఐటీలో టాప్ కంపెనీల్లో (ప్రొడక్ట్ బేస్డ్) వెళ్లాలనుకుంటే కష్టం. సర్వీస్ సైడ్ అయితే అవకాశాలు వస్తాయి. అంటే బెస్ట్ ప్యాకేజీలు, పొజిషన్‌ల కోసం అయితే సీఎస్ఈ, సర్క్యూట్ బ్రాంచీలనే చేయాలి.

**ప్రశ్న: ఎన్ఐటీల్లో కంప్యూటర్ సైన్స్ రాకుంటే ఐఐఐటీల్లో సీఎస్ఈ, ఐటీ వస్తే ఏది ఎంపిక చేసుకోవాలి?**

**సమాధానం:** చాలా మందికి ఈ విషయంలో అనేక సందేహాలు ఉన్నాయి. ఎన్ఐటీ, ఐఐఐటీ ట్యాగ్ వేరే అనే భావన ఉంది. సీఎస్ఈ, ఐటీ విషయంలో ఈ సందేహాలు అవసరం లేదు. ఐఐఐటీల విషయానికి వస్తే ఐఐఐటీ హైదరాబాద్, బెంగళూరు అనేవి ప్రత్యేకం. ఐఐఐటీ హైదరాబాద్ ఐఐటీల స్థాయి ఉన్నది. ఈ రెండు ఐఐఐటీలు జోసా కౌన్సెలింగ్‌లోకి రావు. వాటి ప్రవేశాలు ప్రత్యేకం. అలహాబాద్, గ్వాలియర్, జబల్‌పూర్, కాంచీపురం, కర్నూలు ఐదు ఐఐటీలను వాటిని మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తుంది.

- టాప్ టైర్ ఎన్ఐటీలో సీఎస్ఈ, ఐటీ రాకుంటే వారు ఐఐఐటీ అలహాబాద్‌లో చేరవచ్చు. లేదా గ్వాలియర్, జబల్‌పూర్‌లో కంప్యూటర్ కోర్సుల్లో ప్రవేశాలు తీసుకోవచ్చు. వీటిలో చదివిన అభ్యర్థులకు మంచి ప్లేస్‌మెంట్స్ వస్తున్నాయి.

**ప్రశ్న: ఎన్ఐటీలకు ఐఐఐటీల్లో ట్యాగ్ వ్యాల్యూ అని అంటుంటారు. దాన్ని వివరిస్తారా?**

**సమాధానం:** నిజానికి ఐఐటీ, ఎన్ఐటీలకు భిన్నంగా ఐఐఐటీలు ఉన్నాయి. వీరు సంప్రదాయానికి భిన్నంగా ఫస్ట్ ఇయర్ నుంచి సీఎస్ఈ, ఐటీలో నేరుగా కోర్సులో సిలబస్‌లోకి వెళ్తారు. కానీ ఐఐటీలు, ఎన్ఐటీలు నేటికి పాత పద్ధతిలోనే వెళ్తున్నాయి. ఇక ట్యాగ్ వ్యాల్యూ విషయానికి వస్తే ఎన్ఐటీలు, ఐఐఐటీల్లో కంప్యూటర్ కోర్సులకు ట్యాగ్ వ్యాల్యూను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఐఐఐటీల్లో కూడా బెస్ట్ ప్లేస్‌మెంట్స్ వస్తున్నాయి. ఇతర బ్రాంచీలు, అంశాలు చూసినప్పుడు మాత్రమే ట్యాగ్ వ్యాల్యూ గురించి ఆలోచించాలి. ఐటీ రంగంలో సెటిల్ కావాలనుకునే వారికి ఐఐఐటీలు కూడా మంచి ఆప్షన్ అని చెప్పవచ్చు.

**ప్రశ్న: మెయిన్స్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా ఎన్ఐటీల్లో ఈసీఈ మంచిదా లేదా ఐఐఐటీల్లో ఈసీఈ మంచిదా?**

**సమాధానం:** మొదట ఎన్ఐటీ టాప్, సెకండ్ టైర్‌లో ఈసీఈ, ఈఈఈలు జాయిన్ కావడం మేలు. ఎందుకంటే ఐఐఐటీల కంటే ఎన్ఐటీలు చాలా పాతవి. ఇక్కడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అలూమ్ని ఇలా పలు అంశాల్లో సర్క్యూట్ బ్రాంచీల్లో ఐఐఐటీల కంటే మిన్నగా ఉంటాయి. కాబట్టి కంప్యూటర్ లేదా అనుబంధ కోర్సులు తప్ప మిగిలిన కోర్సులకు ఎన్ఐటీలే ఉత్తమం.

**ప్రశ్న: మెయిన్స్ స్కోర్ కొంత తక్కువ వచ్చి నార్త్ ఈస్ట్ లేదా జమ్మూ వంటి నార్త్ ప్లేస్‌లో ఎన్ఐటీలకు వెళ్లవచ్చా?**

- నార్త్‌లో జలంధర్, కురుక్షేత్ర తదితర ఎన్ఐటీలు చాలా మంచి విద్యను అందించడంతోపాటు మంచి ప్లేస్‌మెంట్స్‌ను సాధిస్తున్నాయి. నార్త్ ఈస్ట్ అంత సూచించ తగినవి కాదు. కానీ సిల్చార్‌లో పరిస్థితులు బాగున్నాయి. దీని బదులు రాష్ట్రంలో టాప్- 10 కాలేజీల్లో సీఎస్ఈ వస్తే ఇక్కడే చేరడం మంచిది.

**ప్రశ్న: డీమ్డ్ యూనివర్సిటీలు మణిపాల్, బిట్స్, వీఐటీ, అమృత తదితర సంస్థల్లో ప్రవేశాలు తీసుకోవచ్చా? రాష్ట్రంలో టాప్-10 కాలేజీల్లో చేరాలా?**

- వీటిలో కూడా టాప్ టైర్ కాలేజీలు చూసుకోవాలి. చక్కటి ప్లేస్‌మెంట్స్, అకడమిక్ అవకాశాలు ఉన్నాయి. కానీ ఫీజు విషయం కూడా చూసుకుని నిర్ణయం తీసుకోవాలి.
- ఎంసెట్‌లో టాప్ కాలేజీల్లో సీఎస్ఈ దాని అనుబంధ బ్రాంచీల్లో సీటు వస్తే బయటకు వెళ్లడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. టాప్- 10లో రాకుంటే బయటకు వెళ్లడం మంచిది. డీమ్డ్ యూనివర్సిటీల్లో దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్నవారు రావడం వల్ల అభ్యర్థులకు మంచి ఎక్స్‌పోజర్ వస్తుంది. కానీ ఆర్థికపరమైన అంశాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి.

**ప్రశ్న: ఇటీవల మెయిన్స్ స్కోర్‌తో కొత్తగా కేంద్రం ప్రారంభించిన గతిశక్తి విశ్వవిద్యాలయం, ఫోరెన్సిక్ యూనివర్సిటీల్లో కూడా ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇవి ఎలా ఉంటాయి?**

- ఇవి మంచి యూనివర్సిటీలే. ఈ ఏడాది ఐఐటీలు, ఎన్ఐటీల్లో కూడా ఈసారి ప్లేస్‌మెంట్స్ కొంత తగ్గాయి. భవిష్యత్తులో కూడా ప్లేస్‌మెంట్స్ పోకడలు మారవచ్చు. అయితే భవిష్యత్తులో స్పెషలైజ్డ్ రంగాల్లో ఇంజినీరింగ్ చేసిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. గతశక్తి యూనివర్సిటీని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇక్కడ సంప్రదాయ కోర్సులను రైల్వే స్పెషలైజేషన్‌తో అందిస్తుంది ఈ సంస్థ. ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్‌లో అభ్యర్థికి అంటే విద్యార్థికి ఆసక్తి ఉంటే ఈ కోర్సులు బెస్ట్ ఎంపిక అని చెప్పుకోవచ్చు. అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగం కావాలనుకునే వారికి ఇది మంచి సంస్థ.
- ఇది మిడ్ టైర్ ఎన్ఐటీ కంటే ఇక్కడ చేరడం మంచిది.
- ఫోరెన్సిక్ యూనివర్సిటీలో సైబర్ సెక్యూరిటీ కోర్సు ఉపయోగ పడుతుంది. ఇదీ మంచి కోర్సే. దీనిద్వారా కూడా మంచి భవిష్యత్తు ఉంటుంది. అయితే ఈ విశ్వవిద్యాలయానికి పలు క్యాంపస్‌లు ఉన్నాయి. వీటి వివరాలు పూర్తిగా తెలుసుకుని ఈ కోర్సులో చేరాలి. ఫోరెన్సిక్ యూనివర్సిటీ హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ ప్రాముఖ్యం కలిగిన యూనివర్సిటీ.

**నోట్:** అభ్యర్థులు, తల్లిదండ్రులు జోసా కౌన్సెలింగ్ ప్రారంభమయ్యే సమయానికి ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీలపై కొంత విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి. వీటిలో కోర్సులు, అకడమిక్ ప్రాధాన్యతలు ఇతర విషయాలన్నింటినీ తెలుసుకుని జోసా కౌన్సెలింగ్‌కు వెళ్లడం మంచిది. అంతేకాకుండా జోసాకు సంబంధించి ఆయా సర్టిఫికెట్స్‌ను తల్లిదండ్రులు సిద్ధం చేయడం మర్చిపోవద్దు.

**కేశవపంతుల వేంకటేశ్వరశర్మ**

## గురుకులంలో డిగ్రీ కోర్సులు

**తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని వరంగల్ అశోక్‌నగర్‌లోని టీటీడబ్ల్యూఆర్ఏఎఫ్‌పీఏలో కింది కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**

- **కోర్సులు- సీట్ల సంఖ్య**
- బీఎస్సీ (ఎంపీసీ)- 40 సీట్లు
- బీఏ (హెచ్ఈపీ)-40 సీట్లు
- కోర్సు కాలవ్యవధి మూడేండ్లు
- **ప్రవేశాలు కల్పించే కాలేజీ:** తెలంగాణ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ అకాడమీ ఫర్ మెన్ (వరంగల్, అశోక్‌నగర్)

**అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో 2023, 2024, విద్యాసంవత్సరంలో ఇంటర్ ఉత్తీర్ణులైన వారు అర్హులు.

- విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతం అయితే రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతం అయితే లక్షన్నర రూపాయిలు మించరాదు.
- అభ్యర్థులు కనీసం 152 సెం.మీ ఎత్తు కంటే ఎక్కువగా ఉండాలి.
- కేవలం పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి

**వయస్సు:** 2024, జూలై 1 నాటికి 16 ఏండ్లు మించరాదు

**ఎంపిక:** ప్రవేశ పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ టెస్ట్, లెక్చురెట్, ఇంటర్వ్యూ ఆధారంగా

**ముఖ్యతేదీలు**

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 30
- **వెబ్‌సైట్:** https://www.ttwrdcs.ac.in